పంతుల జోగారావు



# చెల్లని రూపాయకు బొమ్మ-బొరుసు

బొరుసు :

శివరావుకి అర్జంటుగా అప్పు కావాలి. పదీ పాతికా కాదు. అయిదు వందలు!

అతని నెత్తిమీద పది పైసల నాణెం పెట్టి చందన తాంబూలాదులతో సత్కరిస్తామన్నా ఎవరికీ అక్కర్లేదు. మరతనికి అంత పెద్ద మొత్తం అప్పు ఎలా దొరుకుతుంది?

ఉదయంనుంచి కాళ్ళు అరిగిపోయేలా తిరుగుతున్నాడు. వాళ్ళా వీళ్ళా అనకుండా పరిచయస్తుల నందరినీ నోరు విడిచి అడిగాడు. తన పరిస్థితి

అతి దీనంగా చెప్పుకున్నాడు. అందరూ అతని పట్ల జాలి చూపించారే కాని, అతని కెవరూ సహాయం చేయలేదు.

అయిదు వందలు కాదు కదా అయిదు రూపాయలు కూడా సంపాదించలేక పోయాడతను.

సాయంత్రం అవుతున్న కొద్దీ శివరావుకి బెంగ మరీ ఎక్కువయి పోతోంది. అప్పు దొరకదేమోనన్న భయంతో వడదెబ్బ తిన్నమనిషిలా అయిపోయేడు.

అదృష్టదీవికి చేరబోతూన్న నావ కాస్తా అదుపు తప్పి మునిగిపోతుంటే తల్లడిల్లిపోయే నావికుడు ఎలాంటి మానసిక ఆవేదనని అనుభవిస్తాడో, అలాంటి అనుభవం కలిగింది శివరావుకి.

ఉద్యోగం సంపాదించడంకన్నా, అంత డబ్బు అప్పుగా సంపాదించడం మరీ కష్టమన్న సంగతి గుర్తించి అతను నివ్వెరపోయాడు. ఖిన్నుడయ్యాడు.

జీవితంలో తొలిసారిగా అతనికి డబ్బు మీద రోత కలిగింది. అయితే డబ్బుని అసహ్యించుకుని కూడా ప్రయోజనం లేదని అతనికీ తెలుసును.

అతని జీవితం అతి ముఖ్యమయిన మలుపు తిరగాలంటే సాయంత్రంలోగా అయిదొందలు సంపాదించి తీరాలి...

రాక రాక ఓ ప్రయివేట్ ఫర్మ్‌లో యింటర్వ్యూ వస్తే నిరాశతోనే వెళ్ళి యింటర్వ్యూలో ప్రశ్నలన్నింటికీ జవాబులు చెప్పగలిగడు. ఇంటర్వ్యూ ముగిసిన తరువాత ప్రత్యేకంగా ఆఫీసరుని కలుసుకుని తన పరిస్థితులన్నీ వెళ్లబోసుకుని బావురుమన్నంత పని చేసాక ఆఫీసరు మాట్లాడిన తీరు అతనికి కొంచెం ధైర్యం కలిగించింది.

ఆ ఉద్యోగం తన కిస్తారేమోనన్న ఆశ అంకురించింది. తన కష్టాలు గట్టెక్కుతాయనిపించి సంతోషం కలిగింది.

ఆ తరువాత సీనియర్ క్లర్కు శ్రీమన్నారాయణ తనని హోటలుకి తీసు కెళ్ళి, తన ఖర్చుమీద కాఫీ టిఫిన్లు సేవించి అందించిన సమాచారం విని లిప్తకాలం నోట మాటరాక నిశ్చేష్టుడై పోయిన మాట వాస్తవం. అయిదు వందలు తనవి కాదనుకుంటే ఆ ఉద్యోగం తనకి ఖాయంట! పై ఆఫీసరొకాయనకి దాహం తీర్చాలిట! ఉద్యోగ సంపాదన కోసం చేసే ప్రయత్నాలలో అదేమంత పెద్దమొత్తం ఎంతమాత్రం కాదుట. అంతేకాని లబో దిబో మంటే ఉద్యోగాలు రెక్కలు కట్టుకొచ్చి ఒళ్ళో వాలవట. ఆ డబ్బు తన చేతిలో పడేస్తే ఆయేర్పా ట్లేవో తనే చూస్తానని భరోసా కూడా యిచ్చాడు.

అతని మాటలు విని నీరుకారి పోయినా-శివరావులో ఆశ అంకురించింది. ఉద్యోగం వస్తున్నదంటే ఆ మాత్రం సహాయం అప్పుగా ఎవరయినా చేయక పోరనిపించింది. ఉద్యోగంలో చేరాక

వారి అప్పు వడ్డీతో సహా తీర్చి పారెయ్య వచ్చు కదా అనిపించింది.

తాకట్టు పెట్టడానికి యింట్లో వెండి బంగారాలు మచ్చుకయినా లేవు. ఆస్తి పాస్తులు అసలే లేవు తన డిగ్రీ చదువుకి చేసిన అప్పు మాత్రం హనుమంతుని తోకలా పెరిగి కూర్చుంది. రోజువారీ ఖర్చుల కోసమే అప్పు దొరకటం గగన కుసుమమైపోతోంది.

ఆశ మనిషికి ఊపిరి. ఆ ఊపిరి నిలుపుకుంటూ రాత్రి తల్లి వడ్డిస్తూ వుంటే కందిపొడి అన్నంలో కలుపుకుని ఉల్లిపాయ నంజుకుంటూ తృప్తిగా భోంచేసాడు

'అంత డబ్బు అప్పెవరిస్తార్రా శివుడూ ?' అని సంశయంతో అడుగు తున్న ప్రశ్నకి చిరునవ్వు నవ్వేడు. 'ఎవరో ఒకరిస్తారమ్మా. ఉద్యోగం వస్తున్నదంటే ఆ మాత్రం యివ్వరను కున్నావా ? ఉద్యోగం వచ్చేక తీర్చి పారేద్దాం...మన కష్టాలు యిన్నాళ్ళకి గట్టెక్కాయమ్మా' అన్నాడు ఆనందంతో.

కొడుకు ముఖంలో యిన్నాళ్ళకి ఉత్సాహాన్ని చూసి గుండె తేలిక అయి, కళ్ళు చెమర్చాయి ఆవిడకి.

'భగవంతుడున్నాడు నాయనా' అంటూ తలమీద కొంగు సవరించు కుందామె.

రాత్రి సరిగా నిద్రపట్టలేదు శివరావుకి. ఉండివుండి తెలివి వచ్చేయటం జరిగింది. తెలిసినవాళ్ళలో కాస్త కలిగినవారి పేర్లన్నీ నెమరువేసుకున్నా డతను. ఎవరెవరిని కలవాలో, ఏం చెప్పాలో అన్నీ మనసులో అనుకున్నాడు.

తెల్లవారుతూనే లేచి స్నానంచేసి, కాఫీనీళ్ళు నోట్లో పోసుకుని వీధిలోకి బయలుదేరాడు.

అలా బయలుదేరిన శివరావు ఉదయంనుంచీ తిరగని చోటులేదు. ఎక్కే గుమ్మం, దిగేగుమ్మం. ఎందర్ని కలిసినా ప్రయోజనం లేకపోయింది.

తండ్రి స్నేహితు డొకాయన రైల్వేలో టి. సి. గా చేసి రిటైరయిన వ్యక్తి వున్నాడు. పేరు నిరంజనరావు. అతను శివరావు చెప్పినదంతా విని అలా లంచా లివ్వడం ఎంతమాత్రం మంచిది కాదని సలహా యిచ్చాడు. కేవలం తన కొచ్చే జీతంమీద ముగ్గురు కూతుళ్ళకి ఘనగా పెళ్ళిళ్ళు చేసి కొడుకులకి పెద్ద చదువులు చెప్పించి అంత మేడ అతనెలా కట్టగలిగాడో శివరావు కిప్పుడు ఆలోచిం చేందుకు తీరికలేదు. అది నిజమేనని బేషరతుగా ఒప్పుకుంటూ ప్రస్తుతం అంత కన్నా వేరే గత్యంతరం లేదని అతి వినయంగా వివరించాడు శివరావు.

చివరికి నిరంజనరావుగారు అంత మొత్తం తన దగ్గర లేదనీ, సాయంత్రం లోగా ఎవరినయినా అడిగి జతపరచి వుంచుతాననీ అన్నాడు.

అదే ఆశతో సాయంత్రం చీకటిపడే

వేళకి మళ్ళీ ఆయనను కలిగాడు శివరావు. అతను పెదవి విరచి తను ప్రయత్నించవలసిన చోటల్లా ప్రయత్నించాననీ ఎక్కడా డబ్బు దొరకలేదనీ మరోలా అనుకోవద్దనీ చెప్పేసాడు. అతనిమీదే కొండంత ఆశలు పెట్టుకున్న శివరావు హతాశుడై పోయాడు.

ఆ రాత్రి శివరావుకి నిద్రపట్టలేదు. బాధతో తిన్నది హితవు కాలేదు. ముందు రోజున్న ఉత్సాహం పూర్తిగా క్షీణించి పోయింది. అతనికి తనమీద, తన డిగ్రీమీద, మనుషులమీద చెప్పలేనంత కోపం వచ్చింది. ఆ రాత్రంతా అతను రహస్యంగా కన్నీరు విడుస్తూ గడిపాడు.

మర్నాడు ఉదయం డబ్బు తెచ్చివ్వటానికి మరో వారంరోజులు పడుతుందని చెప్పి బ్రతిమలాడుకునేందుకు శ్రీమన్నారాయణ దగ్గరకి వెళ్ళాడు.

అతను శివరావు వేపు జాలిగా చూసి అన్నాడు— 'సారీ శివరావ్! నిన్న సాయంత్రం వరకూ నువ్వొచ్చి కలుస్తావేమోనని ఎదురుచూసాను. నువ్వే కలిసివుంటే క్రిందో మీదో పడి యేర్పాట్లు చేయగలిగి వుండేవాణ్ని— పరిస్థితి చెయ్యి మీరిపోయిందయ్యా-ఆ జాబ్ మరొకరికి యిచ్చేసారు— ఆ కుర్రాడివాళ జాయనవుతాడు కూడాను.'

నిరుద్యోగి శివరావుకి కాళ్ళక్రింద భూమి గజ గజ లాడినట్లు తోచింది. దుఃఖం కట్టలు తెంచుకుని వొచ్చింది కళ్ళలో గిర్రున నీళ్ళు తిరగ్గా బలవంతాన ఆపుకుని ఇంటికొచ్చి పడ్డాడు.

* * *

బొమ్మ :

కొంతకాలం గడిచింది.

యిల్లు గడవటం కోసం ఓ మార్వాడీ దగ్గర లెక్కలు వ్రాయడానికి కుదురుకున్నాడు శివరావు. అతనిచ్చే అరవై రూపాయలు దేనికీ చాలకపోయినా ఆ పరిస్థితుల్లో అంతకన్నా ఏం చెయ్యాలో తోచలేదతనికి.

ఆ సాయంత్రం పని ముగించుకుని అలసటగా యిల్లు చేరిన శివరావుకి కాఫీ అందిస్తూ 'మధ్యాహ్నం నీకీ కవరిచ్చి వెళ్ళాడురా పోష్టతను' అంటూ ఓ కవరు అందించింది తల్లి.

కవరు చింపి చూసి పట్టరాని ఆనందంతో అరిచాడు శివరావు. 'అమ్మా! నాకు ఉద్యోగం వచ్చిందమ్మా...ఆ మధ్య చిట్ ఫండ్ కంపెనీలో ఇంటర్వ్యూకి వెళ్ళాను చూడు—వాళ్ళు ఉద్యోగంలో చేరమని ఆర్డరు పంపించారమ్మా' అంటూ చంటిపిల్లాడిలా ఎగిరి గంతులు వేసాడు. సంతోషంతో పొంగిపోయి పరవశించి పోయాడు.

ఇలాగే దేశంలో నిరుద్యోగులందరికీ ఒక్కసారిగా ఉద్యోగా లొచ్చేస్తే ఆనందోత్సాహాలతో వారి నవ్వులు తొలకరి జల్లులై కురిసి, ఎన్ని శుభాల పంటలు



పండుతాయో ! ఎన్ని మంగళ వాయిద్యాలు చెలరేగి మ్రోగుతాయో ? !

ఆ తల్లి ముఖం వికసించింది. కోటి దిగుళ్ళ బరువుని దింపుకున్నట్టుగా తృప్తిగా నిట్టూర్చింది. సంతోషంతో కాఫీ గడగడా తాగేశాడు శివరావు. 'అబ్బాయి శివుడికి ఉద్యోగం దొరికిందండీ' అంటూ భర్తతో గర్వంగా చెప్పుకుంటున్నట్టు ఆవిడ కళ్ళు తృప్తిగా భర్త ఫొటో మీదకి మళ్ళేయి. గబగబ వెళ్ళి యింత చక్కెర తెచ్చి కొడుకు నోట్లో పోసింది

శివరావు ఉక్కిరి బిక్కిరయ్యాడు.

పిడికెడు తీపి నోట్లో ఉండగా భరాయించుకోలేక కాదు—

మేరలు దాటిన ఆనందం మనసుని జలదరింపచేసి నందుకని కూడా కాదు–

మాతృవాత్సల్యానికి ముగ్ధుడైనందు వలనా కాదు–

ఆర్డరు కాగితంలో తతిమ్మా వాక్యాలు చదివి! నాలుగు రోజులలో ఉద్యోగంలో చేరాలి ఆ పోస్టుకి కేష్‌తో డీలింగు వుండటంచేత ముందుగా వెయ్యి రూపాయలు డిపాజిట్ చెయ్యాలి...

శివరావుకి నెత్తి మీద మంచుకొండ పెట్టినట్లయి బిర్ర బిగుసుకుపోయాడు.

కేరింతాలు కొడుతూ సంతోషంతో వెలిగిపోయిన కొడుకు ముఖం వెలవెల బోవటం చూసి ఆ తల్లి గాభరాపడింది.

'ఏమయిందిరా శివుడూ! అందులో ఇంకేం రాసారు?' ఆత్రంగా అడిగింది.

శివరావు జీరగొంతుతో దిగులుగా చెప్పాడు.

'ఆవిడ గుండె ఝల్లుమంది. వెయ్యి రూపాయలు! అంత డబ్బు కడితేనే కాని జాయినవనివ్వరూ? మూడు వందల రూపాయల ఉద్యోగానికి వెయ్యి రూపాయలు డిపాజిట్ కట్టాలా!

శివరావు కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. అతని గొంతు తడారి పోసాగింది. కాళ్ళలో నీరసం ఆవహించ నారంభించింది. కుక్కి–మంచంమీద చతికిలబడిపోయాడు.

తల్లి ధైర్యం చెప్పిందతనికి–పరవా లేదు శివా! ఉద్యోగం వచ్చిందనీ– డిపాజిట్ కట్టాలనీ అడిగితే మీ సేఠ్ ఆమాత్రం సర్దుబాటు చెయ్యడూ–ఇన్నాళ్ళ అతని దగ్గర పనిచేసినందుకు ఆమాత్రం సహాయం చేస్తాడులే–ఓ పూట పస్తులుండయినా సరే అతని బాకీ తీర్చేస్తాం...ఇదివరకయితే ఉద్యోగం లేదని చెప్పి ఎవరూ సహాయం చెయ్య లేదు...ఇప్పుడీ ఆర్డరు కాగితం చూపిస్తే ఎవరయినా యిస్తారు–నువ్వెళ్ళి మీ మార్వాడీని అడిగి చూడు...'

శివరావులో ఆశాదీపం మళ్ళీ వెలుగు పుంజుకుని రెపరెప లాడింది.

ఆర్డరు కాగితం జేబులో వుంచుకుని వెళ్ళి తను పనిచేస్తున్న మార్వాడీని కలుసుకున్నాడు. సంగతంతా విని తన వద్ద పని మానేసి శివరావు వేరే ఉద్యోగానికి పోతున్నందుకు బాధని వ్యక్త పరుస్తూ, మంచి ఉద్యోగం సంపాదించు కున్నందుకు మెచ్చుకున్నాడు సేఠ్.


శివరావు డబ్బు సంగతి కదిపి ప్రాధేయపడ్డాడు. మర్నాడు యింటి వద్ద కలవమని చెప్పి పంపించేశాడు మార్వాడీ.

అతను డబ్బు యిస్తానని భరోసా యిచ్చినట్లే భావించి కొంచెం కుదుట పడిన గుండెతో యిల్లు చేరుకున్నాడు శివరావు.

మర్నాడు తన ప్రయత్న లోపం లేకుండా మరి కొందర్ని కూడా కలుసు కుని పరిస్థితి వివరించాడు. ఎవరూ



యువ




అంత మొత్తం యివ్వగలిగే అవకాశం లేదని చెప్పేసారు.

ఆ రాత్రి కూడా శివరావుకి బెంగతో, చుట్టు ముట్టి కలవర పెడ్తున్న ఆలోచనలతో నిద్ర పట్టలేదు. తిండి సహించలేదు. ప్రక్కమీద అటూ ఇటూ దొర్లుతూ గడిపేడు.

మర్నాడు ఆశతో వెళ్ళి మార్వాడీని కలిస్తే రెండురోజులాగి రమ్మన్నాడు. చెయ్యగలిగిందేమీ లేక శివరావు ఆ రెండు రోజులూ ముళ్ళమీద వున్నట్లుగా గడిపాడు. మూడోనాటి సాయంత్రం మళ్ళీ వెళ్ళాడు. మర్చంట్స్ అసోసియేషన్ వారి మీటింగ్ వుంటే దానికి వెళ్ళిపోయాడు మార్వాడీ. డిపాజిట్టు కట్టడానికి మర్నాడే చివరిరోజు. సాయంత్రం లోగా ఎలాగయినా డబ్బు సంపాదించి తీరాలి.

మార్వాడీ యింటిముందు ఏ విధమయిన గుర్తింపు కూడా లేకుండా దేబిరిస్తున్నట్లు రాత్రి పదిగంటల వరకూ గడిపేడు శివరావు. దిక్కు దిక్కుమంటూ వచ్చి పోయే కార్లని ఆశతో పరికించి చూస్తున్నాడు.

ఆ సమయంలో అతనికి ప్రపంచం అంతా డబ్బుమీద నడుస్తున్నట్టనిపించింది. తను — ఆ మహాయంత్రంనుంచి వూడిపోయి వేరుగా పడిపోయిన సీలమాదిరిగా అతనికి తోచింది. శ్మశానంలో వున్నట్టు అనిపించింది. కార్ల హారన్‌లు దిక్కులేని జీవుల మొరలా వున్నాయి. ఆందోళనతో, అశాంతితో, ఎదురు తెన్నులు చూస్తూ గడిపేడు.

పది దాటేక సేఠ్ కారు దూసుకుంటూ వచ్చింది. మార్వాడీ దిగి చరచరమంటూ ఇంట్లోకివెళ్ళి పోయాడు. శివరావు

నిశ్చేష్టు డయిపోయాడు. తేరుకుని నౌకరుని అతిదీనంగా బ్రతిమిలాడి—తనొచ్చి సాయంత్రంనుంచీ పడిగాపులు పడ్తున్న సంగతి అతనికి తెలియజెప్ప మని అడిగాడు. జేబులో మిగిలిన చివరి రూపాయి అతని చేతిలో వుంచి కళ్లలో నీళ్ళు కుక్కుకున్నాడు.

వాడు లోపలికి వెళ్ళి తిరిగొచ్చాడు. 'బాబుగారికి నిద్రొస్తోందిటయ్యా—శివబాబు వచ్చేరని చెప్పాను. ఇప్పుడు మాట్లాడేటందుకు వీలుపడదట—రేపు ఉదయం వచ్చి కలవమన్నారు' అని చెప్పాడు.

ఆ మాటలు శివరావు గుండెలో గునపాలు దించినట్లు బాధ కలిగించాయి. కాళ్ళకింద నేల కరిగిపోతున్నట్లయింది. మెదడు మొద్దుబారి పోతున్నట్లయింది.

కాళ్ళీడుస్తూ ఒంటరి పక్షిలా యిల్లు చేరాడు.

అతని జీవితంలో నిద్ర పట్టని రాత్రులు అనేకం వున్నప్పటికీ ఆ రాత్రి మరీ భయంకరంగా అతని కళ్ళలో నిప్పులు పోసిందేయి. తనిచ్చిన గుక్కెడు కాఫీ అయిష్టంగానే త్రాగి భళ్ళున వాంతి చేసుకోవటంతో గాభరాపడిపోయింది అతని తల్లి. కొడుకు తలమీద చెయ్యి వేసి అడిగింది - 'శివా ! ఏమయింది నాయనా ? జ్వరం వచ్చిందా ?' అని.

'నేను చచ్చిపోతానమ్మా' శివరావు మూలుగుతూ అన్నాడు.

* * *

మర్నాడు—కొనఊపిరి లాంటి ఆశతో జీవచ్ఛవంలా మార్వాడీ దగ్గరకి వెళ్ళాడు శివరావు.

భయం భయంతో ఆ యింట్లో అడుగుపెడుతూ వుంటే పనిమనిషి ఎదురొచ్చి చెప్పాడు- అయ్యగారు లేరు బాబూ! ఉదయాన్నే కార్లో హైదరాబాద్ వెళ్ళిపోయారు' అని. ఆ మాటలు విని శివరావు నిలువునా వణికిపోయాడు.

ఆ ఉదయం—

వందలాది మనుషులు తిరిగే—పట్నం లోని అతి కీలకమయిన ఆ స్థలంలో—సభ్య సమాజంమధ్య శివరావు దుఃఖాన్ని బిగపట్టలేక, వెక్కి వెక్కి వెర్రివాడిలా ఏడిచాడు.

ఊరకుక్క అతని వేపు గుర్రుగా చూసి మొరగటం ప్రారంభించింది.....

---

సానుభూతి చూపితే రగులుతుంది ఆశాజ్యోతి
సాయమందిస్తేనే వెలుగుతుంది అసలైన జ్యోతి
— సహాయనిధికి విరాళమివ్వడం మీ విధి